# దేశానికే ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్

• రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

**ముత్తుకూరు :** మన సంక్షేమ పథకాలు, పాలనా వ్యవస్థ వల్ల దేశానికే ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర వ్యవసాయ–సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ముత్తుకూరు–1 గ్రామ సచివాలయం పరిధిలో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి పాల్గొని, పేదలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ లేదన్నారు. రాజకీయ అజ్ఞానిగా తయారైన పవన్‌కళ్యాణ్ మత్తు వదలక ఏదో ఒక వర్గంపై దాడి చేయడం మొదలుపెట్టాడని ధ్వజమెత్తారు. ఇదే మత్తులో ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్ల వ్యవస్థపై దాడి ప్రారంభించారని విమర్శించారు. ఈ పిచ్చి ప్రేలాపనకు చంద్రబాబు కూడా మద్దతు ఇస్తూ, 70 శాతం మహిళలున్న వలంటీర్ల వ్యవస్థపై దాడికి పూనుకున్నాడని మండిపడ్డారు. ఇంతకంటే సిగ్గుమాలిన చర్యలు మరొకటి లేదన్నారు. ఇటువంటి వ్యవస్థలు లేకపోవడం వల్ల పక్క రాష్ట్రాలు సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయలేకపోతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధనరెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరమణయ్య, సర్పంచ్ బూదూరు లక్ష్మి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ ప్రత్యూష, నాయకులు దువ్వూరు విశ్వమోహన్‌రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, కె.అనితారెడ్డి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

**సంక్షేమాన్ని అందించేందుకే 'జగనన్న సురక్ష'**

**కొడవలూరు:** సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలందని వారికి సైతం న్యాయం చేసేందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు తెలిపారు. మండలంలోని గౌతమ్‌నగర్‌లో జరిగిన 'జగనన్న సురక్ష' క్యాంప్‌లో శనివారం ఆయన పాల్గొని, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు న్యాయం జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంపీపీ జి.జ్యోతి, సర్పంచ్ నాగిరెడ్డి సునీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఎస్కే షబ్బీర్, పార్టీ నేత ఎల్లు జనార్దన్ పాల్గొన్నారు.

**తలమంచిలో..**

మండలంలోని తలమంచిలో తహసీల్దార్ రమాదేవి అధ్యక్షతన జగనన్న సురక్ష క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చేతుల మీదుగా అర్జీదారులకు సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వై.భాస్కర్, ఎంపీటీసీ ఎం.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


ముత్తుకూరులో మహిళకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

**సద్వినియోగం చేసుకోండి**

**మనుబోలు :** 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని కాగితాలపూరు సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తున్నామని వివరించారు. సర్పంచ్ చెముడుగుంట ఏడుకొండలు మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు దూరమైన వారికి సురక్ష ద్వారా న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, ఎంపీటీసీ గుమ్మడి వెంకటసుబ్బయ్య, తహసీల్దార్ శివకృష్ణయ్య, ఏఓ రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అర్హులందరికీ సర్టిఫికెట్లు**

**పొదలకూరు :** అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటి వద్దకే వెళ్లి సర్టిఫికెట్లను అందజేస్తామని తహసీల్దార్ కె.వీరవసంతరావు పేర్కొన్నారు. మండలంలోని మహ్మదాపురం, బత్తులపల్లి సచివాలయాల్లో శనివారం జగనన్న సురక్ష క్యాంప్‌లను నిర్వహించారు. నోడల్ అధికారిగా హౌసింగ్ ఏఈ శివమోహన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ముందుగా వెరిఫికేషన్‌కు వెళ్లి సర్టిఫికెట్లు అవసరమైన వారిని గుర్తించి క్యాంపులో అందజేస్తారన్నారు. అనంతరం సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఎంపీపీ కె.సుబ్బరాయుడు, ఉపసర్పంచ్ కరిపరెడ్డి కృష్ణారెడ్డి చేతులమీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ మల్లికార్జున, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

**సమస్యల పరిష్కారమే లక్ష్యం**

**తోటపల్లిగూడూరు :** చిన్నచిన్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పొట్లపూడి సచివాలయంలో జగనన్న సురక్ష శిబిరం శనివారం జరిగింది. ఈ సందర్భంగా పొట్లపూడి, విలుకానుపల్లి గ్రామాలకు సంబంధించి 1,402 ధ్రువీకరణ పత్రాలను అర్జీదారులకు అందించారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు చిత్తశుద్ధితో పనిచేసి సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వలంటీర్లను దూషిస్తున్న పవన్, చంద్రబాబును ప్రజలు క్షమించరన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హమీద్, ఎంపీడీఓ హేమలత, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, జేసీఎస్ కన్వీనర్ తలమంచి సురేంద్రబాబు, సర్పంచ్ ప్రసూనమ్మ పాల్గొన్నారు.

**ముంగిటకే సంక్షేమ పథకాలు**

**కోవూరు :** ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్ బాబురెడ్డి అన్నారు. మండలంలోని పడుగుపాడు సచివాలయం–3లో జగనన్న సురక్ష శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సాంకేతిక కారణాలతో కొందరికి సంక్షేమ పథకాలు అందడం లేదని, అలాంటి వారికి సురక్ష కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మజ, ఎంపీడీఓ శ్రీహరి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్, సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ అహ్మద్, బొంధిలి కార్పొరేషన్ చైర్మన్ కిశోర్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, వీఆర్వో సుజాత పాల్గొన్నారు.

**కోవూరు(విడవలూరు) :** విడవలూరు మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో జగనన్న సురక్ష శిబిరం శనివారం నిర్వహించారు. డీపీఓ సుస్మితారెడ్డి పాల్గొని, అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ భవానమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ శీనయ్య, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ తిరుపతయ్య, యువజన విభాగం కమిటీ సభ్యుడు ఆవుల శ్రీనివాస్ పాల్గొన్నారు.


తోటపల్లిగూడూరు : పొట్లపూడిలో..


కోవూరు : సర్టిఫికెట్‌ను అందజేస్తున్న నేతలు


కొడవలూరు: అర్జీదారుకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న చలపతిరావు


మనుబోలు : ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు


పొదలకూరు : సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎంపీపీ, సొసైటీ చైర్మన్



కోవూరు : ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

## క్లుప్తంగా

### మైక్‌సెట్ వితరణ


మైక్‌సెట్‌ను అందజేస్తున్న ధర్మకర్తలు

**మనుబోలు :** మనుబోలు పంచాయతీ పరిధిలోని యాచవరం గ్రామంలో అభయాంజనేయస్వామి దేవాలయానికి దాతలు శనివారం రూ.30 వేల విలువైన మైక్‌సెట్, యాంప్లిఫయర్‌ను వితరణ చేశారు. హైదరాబాద్‌కు చెందిన సన్నపురెడ్డి వెంకటరమణారెడ్డి ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యంశర్మ కోరిక మేరకు ఆలయానికి మైక్‌సెట్‌ను విరాళంగా ఇచ్చారు. దీనిని ఆలయ ధర్మకర్తలు చల్లా చిన్నరమణయ్య, వై.అంకయ్య కలిసి అర్చకుడికి అందజేశారు.

### ముగిసిన శిక్షణా తరగతులు


మాట్లాడుతున్న డాక్టర్ రాజేశ్వరి

**ఇందుకూరుపేట :** మండలంలోని పల్లిపాడు డైట్ కళాశాలలో మూడు రోజుల పాటు జరిగిన జీవన నైపుణ్యాల శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి చివరిరోజు ఎస్సీఈఆర్టీ విజయవాడ నుంచి సహాయ ఆచార్యులు డాక్టర్ రాజేశ్వరి హాజరై ఉపాధ్యాయులకు వివిధ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాయామ విద్యా ప్రాంతీయ పరిశీలకుడు డాక్టర్ మహబూబ్‌బాషా, డైట్ అధ్యాపకుడు కె.వెంకటేశ్వరరావు, రిసోర్స్‌పర్సన్‌లు బోయదాసు, విజయచంద్ర, నరసింహరావు పాల్గొన్నారు.

### పేకాట స్థావరాలపై దాడులు

**వెంకటాచలం:** పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేసిన ఘటన మండలంలోని కసుమూరులో శనివారం జరిగింది. కసుమూరు సమీపంలోని పొలాల వద్ద పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో సీఐ గంగాధర్‌రావు, ఎస్సై అయ్యప్ప తన సిబ్బందితో వెళ్లి దాడులు చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.2,800 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

### స్వామి, అమ్మవార్లకు పల్లకిసేవ


ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

**పొదలకూరు :** పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్లకు పల్లకిసేవను శనివారం నిర్వహించారు. ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పల్లకిసేవ గావించారు. గోవింద నామస్మరణలతో దేవస్థానం మారుమోగింది. భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

### దుర్గాభాయ్ దేశ్‌ముఖ్‌కు ఘన నివాళి


దుర్గాభాయ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆశ్రమ సభ్యులు, చిన్నారులు

**ఇందుకూరుపేట :** స్వాతంత్ర్య సమరయోధురాలు దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ జీవితం సమాజసేవకే అంకితం చేసిందని మండలంలోని పల్లిపాడు గాంధీ ఆశ్రమ కో–కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి అన్నారు. ఆశ్రమంలో దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడారు. తొలుత దుర్గాభాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు గంపల మంజుల, పీవీ శేషయ్య, సర్పంచ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### భార్యపై దాడి

**బుచ్చిరెడ్డిపాళెం :** భార్యపై భర్త దాడి చేసి గాయపరిచిన ఘటన మండలంలోని శ్రీరంగరాజపురం గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. శ్రీరంగరాజుపురానికి చెందిన మనోహర్ అతని భార్య మాధవికి గత కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత నెల 29న భర్త మనోహర్, అత్త కామాక్షమ్మ, మామ చిన్నయ్య కలిసి తనపై దాడి చేయడంతో పాటు కత్తితో గాయపరిచారని మాధవి ఫిర్యాదు చేసింది. అయితే మధ్యవర్తుల చేత రాజీ చేసేందుకు ప్రయత్నాలు చేయగా ఫలించకపోవడంతో శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరప్రతాప్ తెలిపారు.

### ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

• పలు దుకాణాల్లో అమ్మకాల నిలిపివేత


నార్తురాజుపాలెంలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

**కొడవలూరు:** మండలంలోని నార్తురాజుపాళెం, యల్లాయపాళెం, పద్మనాభసత్రంలోని ఎరువుల దుకాణాలను కందుకూరు ఏడీఏ పి.అనసూయ, మనుబోలు ఏఓ జహీర్‌ల బృందం శనివారం తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా వారు ఎరువులు, పురుగు మందులను ఎమ్మార్పీకి విక్రయిస్తున్నారా?, ఫారం 'ఓ' కలిగి ఉన్నారా?, స్టాక్ రిజిస్టరులోని నిల్వలకు, వాస్తవ నిల్వలకు వ్యత్యాసాలున్నాయా? అని పరిశీలించారు. పలు దుకాణాల్లో వాస్తవ నిల్వలకు, రిజిస్టరులోని నిల్వలకు వ్యత్యాసాలుండడంతో అమ్మకాలను నిలిపివేస్తూ ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీఏ అనసూయ మాట్లాడుతూ ప్రతి దుకాణదారు విధిగా ఎమ్మార్పీకి విక్రయించడంతో పాటు ఫారం ఓను కలిగి ఉండాలన్నారు. ఎక్కడైనా అవకతవకలు జరిగితే అమ్మకాలను నిలిపివేస్తామని హెచ్చరించారు. వారి వెంట కొడవలూరు ఏఓ లక్ష్మి ఉన్నారు.

### డిగ్రీ పరీక్షలకు 655 మంది గైర్హాజరు

**వెంకటాచలం:** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల్లో శనివారం నిర్వహించిన డిగ్రీ పరీక్షలకు 655 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించిన రెండో సెమిస్టర్ పరీక్షలకు 5,927 మంది విద్యార్థులు హాజరు కావాల్సిఉండగా 5,294 మంది హాజరై 633 మంది గైర్హాజరయ్యారు. కావలిలోని జవహర్ భారతి డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో ఒక విద్యార్థి డిబార్ అయ్యారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన రెండో సెమిస్టర్ పరీక్షలకు 327 మంది విద్యార్థులు హాజరు కావాల్సిఉండగా 305 మంది హాజరై, 22 మంది గైర్హాజరయ్యారు. మొత్తమ్మీద శనివారం జరిగిన పరీక్షలకు 655 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

# గడప గడపకు వెళ్లడం అదృష్టం


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

**బుచ్చిరెడ్డిపాళెం :** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడం తమ అదృష్టమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని పదో వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా స్థానిక సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటిని అక్కడికక్కడే పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు కోవూరు నియోజకవర్గంలో 75 సచివాలయాల పరిధిలో సుమారు 85,845 ఇళ్లకు తిరిగినట్లు తెలిపారు. ఇందులో భాగంగా అనేక సమస్యలను పరిష్కరించామని, ముఖ్యంగా తన నియోజకవర్గ పరిధిలో దివ్యాంగులు, కేన్సర్, టీబీ బాధితులు, తల్లిదండ్రుల్లేని పిల్లల సమస్యలను గుర్తించి వారికి ఆసరాగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రధాన కారణం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం అని వెల్లడించారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ సుధీర్, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కౌన్సిలర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ, రహమత్, షకీలాబేగం, శివకుమార్‌రెడ్డి, సత్యనారాయణ, అనంతమ్మ, ప్రమీలమ్మ, శ్రీదేవి, పార్టీ నేతలు విజయభాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, భరత్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రవల్లిక, కామేశ్వరి, విల్సన్ పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదంపై విచారణ చేపట్టాం

• వలంటీర్ పాత్ర ఉందని నిర్ధారణ కాలేదు
• ఎస్సై జంపానికుమార్

**తోటపల్లిగూడూరు :** మండలంలోని సౌత్‌ఆములూరులో శుక్రవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంపై విచారణ చేపట్టామని ఎస్సై జంపానికుమార్ తెలిపారు. సౌత్‌ఆములూరు అరుంధతీయ కాలనీకి చెందిన వంగవీటి శీనయ్య, గ్రామ వలంటీర్ మందా సుబ్రహ్మణ్యం మధ్య శుక్రవారం చిన్నపాటి గొడవ జరిగింది. ఈ క్రమంలో రాత్రి శీనయ్యకు చెందిన తడికలు మంటల్లో కాలిపోయాయి. గొడవను దృష్టిలో పెట్టుకుని సుబ్రహ్మణ్యం తన పూరింటిని తగలబెట్టాడంటూ శీనయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో ఎస్సై జంపానికుమార్ శనివారం తన సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలంలో విచారణ చేపట్టారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ప్రమాద సమయంలో సుబ్రహ్మణ్యం దూరంగా ఉన్నాడని, బాధితుడు కేవలం వలంటీర్‌పై అనుమానం వ్యక్తం చేస్తున్నాడని చెప్పారు. విచారణ తర్వాత వాస్తవం తెలుస్తుందన్నారు.

## కరోనా సమయంలో అండగా..



ఈ ఫొటోలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పేరు చల్లా శ్రీనివాసులు. పొదలకూరు బిట్–2 సచివాలయ పరిధిలో వలంటీర్‌గా పనిచేస్తున్నారు. కరోనా సమయంలో అనారోగ్యానికి గురై మంచంలో ఉన్న వృద్ధుడి ఇంటికి వెళ్లి పింఛన్ అందజేశాడు. కోవిడ్ నేపథ్యంలో సొంత మనుషులే దూరంగా ఉండే రోజుల్లో వలంటీర్లు ధైర్యంగా ఇంటింటికీ వెళ్లి పింఛన్లను అందజేశారు.

## ఇంటింటికీ భోజన ప్యాకెట్లు

ఈ ఫొటోలో భోజన ప్యాకెట్లను ఆటోలో సర్దుతున్న వారు పొదలకూరు బిట్–4 వలంటీర్లు. వీరు పట్టణానికి సమీపంలో ఉన్న తెలుగుగంగ పునరావాసం(వెంకటేశ్వరనగర్) నివాసితులు. కరోనా కష్టకాలంలో స్థానికులతో కలిసి ఆహార పొట్లాలను అందజేశారు. కోవిడ్ నేపథ్యంలో బయటకు వెళ్లలేని నిరుపేదలను గుర్తించి వారి ఇంటికే భోజన ప్యాకెట్లను చేరవేశారు.

అంతేకాక వెంకటేశ్వరనగర్లో భోజనాలు ఏర్పాటు చేసి పెట్టారు. సరైన ఆహారం లేని పేదలకు మంచిభోజనం అందించారు.


వెంకటేశ్వరనగర్లో ఆహార పొట్లాలను తరలిస్తున్న వలంటీర్లు

# మంత్రికి లింగంపల్లి రైతుల సన్మానం

**పొదలకూరు :** రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో లింగంపల్లి రైతులు శనివారం సన్మానించారు. మంత్రి చొరవ తీసుకుని వైఎస్సార్ జలకళ పథకంలో భాగంగా గ్రామానికి 27 బోర్లను వేయించారు. వీటిలో నీరు కూడా పుష్కలంగా పడడంతో రైతులు మంత్రిని కలిసి తమ ఆనందం వ్యక్తం చేశారు. బోర్లు మంజూరు వేయించిన మంత్రిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పొదలకూరు ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గుంటి శ్రీనివాసులు, అనమాల వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మంత్రి కాకాణిని సన్మానిస్తున్న లింగంపల్లి రైతులు

# జగనన్న సురక్షపై అవగాహన

**మనుబోలు :** మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నేతలు దాసరి మహేంద్రవర్మ, దువ్వూరు సుధాకర్‌రెడ్డి జగనన్న సురక్షపై శనివారం అవగాహన కల్పించారు. కోదండరామపురంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న 11 రకాల ధ్రువీకరణ పత్రాల గురించి వివరించారు. ఈ సందర్భంగా నడవలేని వృద్ధులకు వలంటీర్ల ద్వారా ఆధార్‌తో ఫోన్ నంబర్‌ను లింక్ చేయించారు. ప్రతిఒక్కరూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


వృద్ధురాలికి ఆధార్ లింకింగ్ చేయిస్తున్న నాయకులు

## యాజమాన్య పద్ధతులు పాటించాలి

**కోవూరు(విడవలూరు) :** రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఆత్మ డైరెక్టర్ శివనారాయణ అన్నారు. మండలంలోని రామతీర్థం రైతుభరోసా కేంద్రం వద్ద వరి, వేరుశనగను సాగుచేస్తున్న రైతులకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల ప్రాధాన్యతపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, విజయకుమార్‌నాయక్, చక్రవర్తి, రమణయ్య, మహేష్ పాల్గొన్నారు.


వరిపైరును పరిశీలిస్తున్న ఆత్మ డైరెక్టర్, శాస్త్రవేత్తలు

## తరగతి గదికి రూ.10 వేల వితరణ

**ముత్తుకూరు :** మండలంలోని బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్‌లో తాత్కాలిక అదనపు గది నిర్మాణానికి ఓ మహిళ నగదు వితరణ చేసింది. హైస్కూల్‌లో 8వ తరగతి చదివే ఉదయకుమార్ అనే విద్యార్థి నాన్నమ్మ చిరమన మహాలక్ష్మమ్మ రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్రకళకు అందజేశారు. ఆమె దాతృత్వానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు ధన్యవాదాలు అర్పించారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

**బుచ్చిరెడ్డిపాళెం :** రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలకు గాయాలైన ఘటన బుచ్చిరెడ్డిపాళెంలోని కనిగిరి రిజర్వాయర్ వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు అంబాపురానికి చెందిన ప్రసాద్ అతని భార్య సునంద నెల్లూరు వైపు వస్తుండగా గుర్తుతెలియని బైక్ రాంగ్‌రూట్‌లో వచ్చి వీరి బైక్‌ను ఢీకొంది. దీంతో ప్రసాద్, సునందలకు గాయాలయ్యాయి. వీరిని 108లో బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీకి తరలించారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.